## క్లుప్తంగా

### జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు విద్యార్థిని ఎంపిక


ఎంపికైన శ్రీహిత

**డిచ్‌పల్లి:** మండలంలోని రాంపూర్ గ్రామంలో గల జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థిని పి.శ్రీహిత జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం గంగసావిత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'క్వాంటం యుగం– సంభావ్యతలు– సవాళ్లు' అనే అంశంపై జెడ్పీహెచ్ఎస్ సుద్దపల్లిలో జరిగిన మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో చక్కని ప్రతిభ కనబరిచిన శ్రీహిత జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు.

### బీడీ స్కాలర్‌షిప్‌పై అవగాహన



**మోపాల్:** నగరశివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీడీలు కార్మికుల పిల్లలకు బీడీ స్కాలర్‌షిప్ అంశంపై ఈఎస్ఐ డాక్టర్ హరిణి బుధవారం అవగాహన కల్పించారు. తరగతి వారీగా బాల బాలికలకు వచ్చే స్కాలర్‌షిప్ వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. అలాగే బీడీలు చుట్టే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీఎస్‌సీ సెంటర్ ప్రతినిధులతో నామినల్ ఫీజుతో 20 మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. అర్హత కలిగిన వారు బీడీ స్కాలర్‌షిప్‌ల కోసం సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ రచ్చ ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### బాధితులకు సరుకుల పంపిణీ



**సిరికొండ:** మండలంలోని గడ్కోల్ గ్రామంలో వరద బాధితులకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 25 మంది బాధితులకు ప్రిన్సిపాల్ నర్సయ్య సరుకులను బుధవారం అందజేశారు. మాజీ ఎంపీటీసీ లింబాద్రి, భూషణ్‌రెడ్డి, గడీల శ్రీనివాస్, కారల్‌మార్క్స్, శేఖర్, కారోబార్ సాయిలు, ఉపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న మరమ్మతులు

**సిరికొండ:** మండలంలోని గడ్కోల్ ట్రాన్స్‌కో సెక్షన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు కొనసాగుతున్నాయి. గత నెల 28న కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు పెద్ద ఎత్తున ధ్వంసమయ్యాయి. సెక్షన్ పరిధిలో 1300 విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ధ్వంసమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పొలాల మధ్యన ఉండటంతో మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో గత పది రోజుల నుంచి మరమ్మతు పనులు చేపడుతూనే ఉన్నారు.

### రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ గోపిశెట్టి రాంబాబు ను బుధవారం తెయూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకోవడం తెలంగాణ యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బట్టు సురేష్, బికోజి, రవీందర్, ఆసిఫ్, నరేష్, నవీన్, మధులిక, సుధీర్, సతీష్, రవి, తిరుపతి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 114,100 | వెండి(కిలో) | 1,31,000 |
| 22 క్యారెట్స్ | 105,360 | – నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 160 |
| | | లైవ్ | 120 |
| స్కిన్‌లెస్ | 180 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 16 | 32 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 20 | 40 | పచ్చిమిర్చి | 40 | 80 |
| బీరకాయ | 40 | 80 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 40 | 80 | ఆలుగడ్డ | 20 | 40 |
| చిక్కుడుకాయ | 35 | 70 | గోబిగడ్డ | 10 | 20 |
| కాకరకాయ | 30 | 60 | గోబిపువ్వు | 30 | 60 |
| వంకాయ | 40 | 80 | బీట్‌రూట్ | 30 | 60 |
| పాలకూర | 50 | 100 | కరివేపాకు | 40 | 80 |
| మెంతికూర | 60 | 110 | చామగడ్డ | 30 | 60 |
| కొత్తిమీర | 30 | 60 | చిక్కుడుకాయ | 30 | 60 |
| పుదీనా | 40 | 80 | గోరుచిక్కుడు | 40 | 80 |
| క్యాప్సికం | 40 | 80 | | | |

–సుభాష్‌నగర్

# చాకలి ఐలమ్మకు ఘన నివాళి


బోర్గాం(పి) చౌరస్తాలో ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు


నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


చిన్నవాల్గోట్ గ్రామంలో.. రజక ఐక్య వేదిక యువజన కమిటీ నాయకులు


సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నిజామాబాద్ రూరల్/మోపాల్/నిజామాబాద్ సిటీ/సిరికొండ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక ఉద్యమాలను చాకలి ఐలమ్మ స్ఫూర్తితో చేపడుతామని సీపీఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య పేర్కొన్నారు. బుధవారం నగరశివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు నాయకులు నూర్జహాన్, సుజాత, కటారి రాములు, అనిత, రఫిక్ ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పించారు. రూరల్‌మండలం సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐలమ్మ చిత్రపటాలనికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. సిరికొండ మండలం చిన్నవాల్గోట్ గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి నిజామాబాద్ రజక ఐక్య వేదిక యువజన కమిటీ ప్రధాన కార్యదర్శి బండి నరేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు కమలాపురం రాజన్న, రాజేశ్వర్, సీహెచ్ సాయాగౌడ్, మేకల సాయిలు, వేల్పూర్ గంగారాం, పి రంజిత్‌కుమార్, వేల్పూర్ రమేష్, హుస్సేన్, ఉపాధ్యాయులు గోపాల్, విద్యాసాగర్, ఘనపురం దేవేందర్, కృష్ణం రాజు, కొండూర్ రజక సంఘం సభ్యులు రాము, గంగాధర్, అశోక్, నితిన్, సాయి, చిన్నగంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు నడపాలి


ఘన్‌పూర్ లో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

### విద్యార్థుల రాస్తారోకో

**డిచ్‌పల్లి:** మండలంలోని ఘన్‌పూర్ గ్రామం ఇస్లాంపురా కాలనీల నుంచి డిచ్‌పల్లి మోడల్ స్కూల్ కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులు పీడీఎస్‌యూ, టీయూసీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. ఘన్‌పూర్ ఇస్లాంపురా కాలనీల నుంచి ప్రతి రోజు మోడల్ స్కూల్‌కు సుమారు 60 మంది విద్యార్థులు వెళ్తారని తెలిపారు. ఆర్టీసీ బస్సు డిచ్‌పల్లి, దూస్‌గాం గ్రామాల మీదుగా వెళ్లేసరికి మోడల్ స్కూల్ కు విద్యార్థులు గంట ఆలస్యంగా చేరుతున్నారన్నారు. ప్రతి రోజూ ఒక పీరియడ్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఘన్‌పూర్ నుంచి నేరుగా మోడల్ స్కూల్‌కు వెళ్లేలా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. లేదంటే మల్లాపూర్, రాంపూర్ నుంచి వచ్చే బస్సు పాఠశాల సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



**నిజామాబాద్ రూరల్:** నగరంలోని వినాయకుడి ఆలయాల్లో బుధవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వజనిక్ గణపతి ఆలయం, బొడ్డెమ్మచెరువు వద్ద మహాగణపతి దేవాలయం, గాయత్రినగర్‌లో సిద్ధివినాయక స్వామి దేవాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద గల శుభం కరోతి గణపతి ఆలయం, బోర్గం లక్ష్మీగణపతి మహా ఆలయాల్లో గణనాథునికి పంచామృతాభిషేకం, గరికపూజ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ చైర్మన్లు సీహెచ్ భూషణ్‌చారి, మచ్చ చంటయ్య, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు


మాట్లాడుతున్న డా. విశాల్ ఆకుల

**నిజామాబాద్‌నాగారం:** నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని భారత మానసిక వైద్యుల సంఘం డైరెక్ట్ కౌన్సిల్ సభ్యులు ప్రొఫెసర్ డా. విశాల్ ఆకుల అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథులుగా డా. విశాల్ ఆకుల, జిల్లాలోని ప్రముఖ సైకియాట్రిస్ట్ డా. రవితేజ ఇన్నమూరి హాజరై మాట్లాడారు.స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ అధికారి సాంబశివరావు, డా. అనుపమ మెడికల్ ఆఫీసర్, డీహెచ్‌ఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ద్వారకానగర్‌లోని ప్రశాంతి న్యూరో సైకియాట్రిక్ ఆస్పత్రిలో ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎంఎ అధ్యక్షులు డా. అజ్జ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డా. విక్రంరెడ్డి, కోశాధికారి, మానసిక వైద్య నిపుణులు డా. రాజేందర్ సూరినీడు రోగులకు ఆత్మహత్య నివారణపై అవగాహన కల్పించారు. వైద్యులు వినోద్ కుమార్ గుప్తా, హరీష్ స్వామి, వికాస్, అరుణ్ రెడ్డి, దీపక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాద బీమాచెక్కు అందజేత



**ఇందల్వాయి:** మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన ప్రశాంత్ ప్రమాదవశాత్తు ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎల్లారెడ్డి పల్లె శాఖలో ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. బుధవారం అతడి భార్య రవళికి రూ. 10 లక్షల ప్రమాద బీమా చెక్కును బ్రాంచ్ మేనేజర్ సరికొండ నాగరాజు అందించారు. రూ. 500 తో ప్రతి ఖాతాదారుడు ఈప్రమాద బీమా పొందవచ్చని బీఎం తెలిపారు.

### అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



**నిజామాబాద్ రూరల్:** అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని ఒకటో డివిజన్ పరిధిలోని కాలూర్‌లో 31 ఇందిరమ్మ ఇళ్లకు వారు భూమి పూజ చేసి మాట్లాడారు. రూరల్ నియోజక వర్గంలో 3,500, డివిజన్ పరిధిలో 600 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అగ్గు భోజన్న, మార్కెట్ కమిటీ డైరక్టర్ బాగారెడ్డి, నాయకులు సాయాగౌడ్,వెంకట్ రెడ్డి, కోర్వ శ్రీనివాస్, నరేందర్, .దర్మరెడ్డి, బాలాగౌడ్, శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



**నిజామాబాద్ లీగల్ :** ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా జడ్జి జీవీఎన్ భారతలక్ష్మి తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ కోసం జిల్లా వ్యాప్తంగా 18 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

## సంక్షిప్తం

### టీజీ సీపీగెట్‌లో సత్తాచాటిన గిరిరాజ్ కాలేజీ విద్యార్థులు

**నిజామాబాద్ అర్బన్:** రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పీజీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన టీజీ సీపీ గెట్ 2025లో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సత్తా టారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ పి. రామ్ మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. రంగరత్నం, అధ్యాపకులు బుధవారం అభినందించారు. లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకును మునిగంటి కీర్తన సాధించారు. మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో అత్యధికంగా 50 లోపు ర్యాంకుల్లో 5 ర్యాంకులను కాలేజీ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. టోపీ దుర్గ ప్రసాద్ 2వ ర్యాంక్, నూనె అఖిల్ తేజ 5వ ర్యాంక్, పండుగ వైష్ణవి 7వ ర్యాంక్, పోతుల వైష్ణవి 24వ ర్యాంక్, గుగ్గిలం స్ఫూర్తి 35వ ర్యాంక్, సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో సలిగంటి సుప్రియ 66వ ర్యాంక్ ను, బయోటెక్నాలజీలో మహమ్మద్ హసీనా 128వ ర్యాంక్, హిందీలో చింతల అఖిల 78వ ర్యాంక్, ఇంగ్లీషులో మైల గంగోత్రి 20వ ర్యాంక్, అల్గోట్ పూజ 63వ ర్యాంక్, షగుఫ్టా కౌసర్ 124వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. జువాలజీ సబ్జెక్టులో మొత్తం 18 ర్యాంకులు పొందగా 100 లోపు ర్యాంకుల్లో ఫరియల్ తాబ 18వ ర్యాంక్, జియా కౌసర్ 96వ , అరోరా నౌరిన్ 98వ ర్యాంకులతో సత్తా చాటారు.

### విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం

**నిజామాబాద్‌అర్బన్:** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల అకడమిక్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం లైఫ్ సైన్స్ విద్యార్థులకు, ఆర్ట్స్ విభాగం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులను, రిజల్ట్స్ రికార్డును, అకడమిక్ కార్యకలాపాలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రంగరత్నం, పరీక్షల నియంత్రణాధికారి భరత్‌రాజ్, చరిత్ర విభాగం అధిపతి రమేశ్ గౌడ్ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఎం. రామస్వామి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### సేవ్‌లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

**నిజామాబాద్‌నాగారం:** నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, మెర్సిడెస్ బెంజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో సేవ్‌లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ సమయంలో పని ప్రాంతాల భద్రతను మెరుగుపరచడపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థపకులు సీఈఓ తివారీ మాట్లాడుతూ వర్క్‌షాపు రోడ్డు భద్రతను మెరుగుపరుస్తుందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ కామారెడ్డి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### జీవశాస్త్రం ఉపాధ్యాయుడిని కేటాయించాలి

**మోపాల్:** మండలంలోని మంచిప్ప జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు జీవశాస్త్రం (బయోలాజీ) ఉపాధ్యాయుడిని కేటాయించాలని జై భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నాయుడు సాయిరాం కోరారు. ఈమేరకు ఆయన బుధవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డికి లేఖ ద్వారా విన్నవించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించాలని సాయిరాం విజ్ఞప్తి చేశారు.

### న్యూట్రిషన్ పై విద్యార్థులకు అవగాహన

**నిజామాబాద్ అర్బన్:** అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యం న్యూట్రిషన్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం ఇన్‌చార్జి కవిత, జనరల్ స్పెషలిస్ట్ సౌమ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇన్‌చార్జిప్రిన్సిపాల్ బిలాల్, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు

### బల్దియా నుంచి 18 మంది వార్డు ఆఫీసర్ల రిలీవ్

**నిజామాబాద్ సిటీ :** మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న 18 మందికి మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ రిలీవ్ చేశారు. వీరంతా గ్రామపాలనా అధికారులుగా ఎంపికయ్యారు. వీరు నిర్వహించిన పనులను ఇతర వార్డు ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. డివిజన్లు 11,15, 34, 35, 38, 39, 42, 46, 51, 59 వార్డు ఆఫీసర్లు బదిలీ అయ్యారు. పాతవారికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

### పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

**డిచ్‌పల్లి:** మండలంలోని సుద్దులం జెడ్పీహెచ్ఎస్‌కు ప్రముఖ వ్యాపారవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి సుమారు రూ.50వేల విలువ గల క్రీడాసామగ్రిని అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు బి.గంగారాం బుధవారం తెలిపారు. క్రీడాసామాగ్రి అందజేసిన దయానంద్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఫిజికల్ డైరక్టర్ రాజ్‌కుమార్ లకు పాఠశాల విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు హెచ్‌ఎం గంగారాం, పీఈటీ రమేష్, వీడీసీ సభ్యులు తెలిపారు.

### ఉచిత మెటీరియల్ పంపిణీ

**నిజామాబాద్‌అర్బన్:** నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. హిస్టరీ అధ్యాపకులు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ సెల్ అధికారి నరసయ్య సమకూర్చిన ఈ మెటీరియల్‌ను జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు.

## రోటరీ క్లబ్ జెమ్స్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

**నిజామాబాద్ నాగారం:** నగరంలో వంశీ హోటల్ ఇంటర్నేషనల్‌లో రోటరీ క్లబ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో బుధవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ చైర్మన్ పాకాల నరసింహారావు 11 మంది ఉపాధ్యాయులు బి. శ్రీలత, వి. శ్రీశైలం,పి.రోజా, కె.కళావతి, ఎం.గంగా జ్యోతి, సీమ కులకర్ణి,సిరిపురం నారాయణ,కె. రామ్ గోపాల్ రెడ్డి, పి. భాగ్యలక్ష్మి, ఆర్. గోపాల్ కృష్ణ ,కె. సుజాతలను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ గంజి రమేష్, కాకతీయ రీజియన్ ట్రైనర్ రంజిత్ సింగ్, ప్రాజెక్టు చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు గిరీష్ కుమార్, గౌరీ శంకర్, వీరబ్రహ్మం, దండు గోవర్ధన్, సూర్య ప్రకాష్, రాజ శేఖర్, డాక్టర్ వినోద్ పవర్, వాసు, రాంప్రసాద్ పాల్గొన్నారు .

# రైతులకు తప్పని నిరీక్షణ

- భూభారతి సదస్సులో సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పరిస్థితి
- ఇందల్వాయి మండలంలో నెమ్మదిగా సాగుతున్న భూసమస్యల పరిష్కారం




**ఇందల్వాయి:** భూ రికార్డుల ప్రక్షాళన,ధరణి వెబ్‌సైట్‌ల ద్వారా రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రైతు సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించింది. సమస్యలను పరిష్కరించే ప్రక్రియ నెమ్మదిగా సాగుతుందని రైతులు విమర్శిస్తున్నారు. దరఖాస్తులు చేసి రెండు నెలలు గడుస్తున్నా విచారణకు సంబంధించిన నోటీసులు కూడా అందడం లేదని, సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పరిష్కార ప్రక్రియ ఇలా...**

రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులు అన్నింటిని మొదట ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అనంతరం వాటిని పరిశీలించి పీవోటీ, సాదాబైనామాలకు సంబంధించిన వాటివి కాకుండా మిస్సింగ్ సర్వే నంబరు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, భూ స్వభావంలో మార్పులు, మ్యూటేషన్ విత్ విత్‌అవుట్ పాస్‌బుక్ వంటి దరఖాస్తులకు విచారణ నోటీసులు అందించారు. అనంతరం క్షేత్ర స్థాయిలోకి వెళ్లి రైతుల సమక్షంలో విచారణ చేసి,తగిన ఆధారాలు సేకరించి సమస్యను బట్టి నివేదికలను ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు పంపిస్తున్నారు. అక్కడ అధికారులు ఆధారాలు సరిగా ఉంటే దరఖాస్తులు ఆమోదించి, భూ వివరాలను రైతుల పేరుమీద ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**జాప్యం ఇలా....**

దరఖాస్తులన్ని ఆన్‌లైన్ అయ్యాక వాటి విచారణకు సంబంధించిన నోటీసులు ఆర్డీవో కార్యాలయం నుంచి సకాలంలో వెలువడటం లేదు. అక్కడి నుంచి వచ్చిన నోటీసులకు సంబంధించిన ఆధారాలు,పత్రాలు సకాలంలో సిద్ధం కావడం లేదు. స్థానిక అధికారులు విచారణ పూర్తి చేసి పంపిన దరఖాస్తులు ఆర్డీవో కలెక్టర్ కార్యాలయాల్లో సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదు. మొదట వేగంగా కొనసాగిన పరిష్కారం ప్రక్రియ రైతుల నుంచి స్పందన లేకపోవడం, సిబ్బంది లేకపోవడంతో నెమ్మదించింది. దీంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న రైతులకు నిరాశే ఎదురవుతుంది.

### నోటీసులు వచ్చినా విచారణ చేయడం లేదు



మా భూ సమస్యకు సంబంధించి ఒక సర్వే నంబరు దరఖాస్తు ఆర్డీవో ఆఫీసులో పెండింగ్‌లో ఉంది. మరో సమస్యకు సంబంధించి నోటీసు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో విచారణకు రావడం లేదు. మరో సమస్యకు సంబంధించి ఇంకా విచారణ నోటీసు రాలేదు. చాలామంది రైతులు ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా రు. రైతులకు న్యాయం చేయాలి.

– కేపీ శ్రీకాంత్‌రెడ్డి, నల్లవెల్లి

### రైతులందరికి నోటీసులు ఇస్తున్నాం

ఇందల్వాయిలో 3,578 దరఖాస్తులు వచ్చాయి. భూసమస్యలపై దరఖాస్తులు చేసుకున్న రైతులందరికి నోటీసులు పంపించి విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తున్నాం . భారీ వర్షాలు, వరదలతో భూసమస్యల పరిష్కారం నెమ్మదించిన మాట వాస్తవమే. వీలైనంత తొందరగా రైతులందరి సమస్యలపై విచారణ పూర్తి చేసి వారికి న్యాయం జరిగేలా చూస్తాం.

–వెంకట్‌రావు, తహసీల్దార్, ఇందల్వాయి

## రైతులకు నష్టపరిహారం అందించాలి


మాట్లాడుతున్న కార్ల్‌మార్క్స్

**డిచ్‌పల్లి:** రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. బుధవారం డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరికి ఎకరానికి రూ.50వేలు, సోయాకు రూ.70 వేలు పరిహారం చెల్లించడంతోపాటు, ఇళ్లు కూలిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ప్రాణహిత –చేవేళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయడానికి రూ.1500 కోట్లు నిధులు విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం తప్పుడు విధానాలతో జిల్లాలో మూతపడ్డ చక్కెర ఫ్యాక్టరీలను తెలిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవస్వామి, న్యూడెమొక్రసీ మండల కార్యదర్శి జేపీ గంగాధర్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి

**సిరికొండ:** భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కార్ల్‌మార్క్స్ డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్‌లో ఏఐకెఎంఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు ఎకరానికి రూ. 25 వేలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. మండలాధ్యక్షుడు నిమ్మల భూమేష్, కార్యదర్శి ఎల్లయ్య, గులాం హుస్సేన్, చిన్న గంగాధర్, జాకీర్, పెద్ద రాజాగౌడ్, నర్సాగౌడ్, సంజీవ్ తదితరులున్నారు.

## యూరియా కోసం రైతుల బారులు


యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

**జక్రాన్‌పల్లి:** మండల కేంద్రంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్ షాప్ వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు. షాప్ వద్దకు యూరియా బస్తాల కోసం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూ కట్టారు. మండల వ్యవసాయ అధికారులు రైతులకు పర్మిట్లు జారీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిచ్‌పల్లి సీఐ వినోద్‌కుమార్ పరిస్థితిని పర్యవేక్షించారు. జక్రాన్‌పల్లి ఏఎస్సై శంకర్, పోలీసు సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

### జేసీఐ ఆధ్వర్యంలో శిక్షణ



**నిజామాబాద్ నాగారం:** జేసీఐ వారోత్సవాల్లో భాగంగా బుధవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని జేసీఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు పెంటోటి గౌతమి తెలిపారు.నగరంలోని గిరిజన సంక్షేమ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు, వాగ్దేవి విద్యానికేతన్ లోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేసీఐలో సేవకు సంబంధించిన అంశాలను స్కిల్ ట్రైనర్ మదం మహిపాల్ వివరించారు.వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు జేసీఐ పూర్వ అధ్యక్షులు శ్రీహరి, చంద్రశేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

### ఓటరు తుది జాబితా ప్రదర్శన



**డిచ్‌పల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటరు తుది జాబితాను ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానం సంబంధించి అన్ని గ్రామ పంచాయతీ లలో తుది ఓటరు జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. 46,893 ఓటర్లు ఉండగా, పురుషులు 21,813, మహిళలు 25,080 మంది ఓటర్లు ఉన్నారని ఎంపీడీవో తెలిపారు.